నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 12 అక్టోబర్ 2024 | RANGAREDDY

కాంగ్రెస్ హయాం..
అక్రమాలమయం

మీడియాతో మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

- ప్రజలకు కష్టాలు, రైతులకు తీవ్ర ఇబ్బందులు
- పది నెలలుగా అభివృద్ధి పనులు శూన్యం
- తాండూరులో అక్రమంగా ఇసుక, ఎర్రమట్టి రవాణా
- ఊసరవెల్లిలా రంగులు మార్చుతున్న మహేందర్‌రెడ్డి
- మీడియా సమావేశంలో తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు, అక్టోబర్ 11 : బీఆర్ఎస్ పాలనలో అద్భుతంగా ఉన్న తెలంగాణ.. కాంగ్రెస్ పరిపాలనలో ఎలా మారిందో ప్రజలందరూ ఆలోచించాలని తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో రోహిత్‌రెడ్డి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం నాశనమవుతున్నదన్నారు. ప్రజలతో పాటు ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో రైతులకు నిత్యం పండుగలా ఉండేదన్నారు. కాంగ్రెస్ పాలనలో పండుగలు కూడా నిర్వహించుకోలేని పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా అన్యాయం, అక్రమాలు రాజ్యమేలుతున్నాయని పేర్కొన్నారు. తాండూరులో బ్రదర్స్ పాలనతో అభివృద్ధి శూన్యంగా మారిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో తీసుకొచ్చిన అభివృద్ధి పనులను ముందుకు సాగించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తాండూరు నియోజకవర్గంలో అక్రమంగా ఇసుక రవాణా, ఎర్రమట్టి వ్యాపారం కొనసాగుతున్నదన్నారు. అధికారులను భయాందోళనకు గురి చేస్తూ కొందరు నేతలు అక్రమ వ్యాపారాలు చేయడం విడ్డూరమని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ నాయకులకు త్వరలో బుద్ధి చెబుతామన్నారు. ప్రజలు కాంగ్రెస్ పాలనలో తాండూరు నేతలను గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో సరైన బుద్ధి చెబుతామంటూ ఫోన్ చేస్తున్నారని తెలిపారు. ఊసరవెల్లిలా రంగులు మార్చే మహేందర్‌రెడ్డికి విలువలు లేవన్నారు. బీఆర్ఎస్‌లో రెండు మార్లు మంత్రి పదవి అనుభవించి కేసీఆర్‌ను మోసం చేసి కాంగ్రెస్‌లో మళ్లీ పదవుల కోసం వెళ్లిన మహేందర్‌రెడ్డికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. కాంగ్రెస్ నేతలు కూడా మహేందర్‌రెడ్డి దగ్గరకు పోవడం లేదన్నారు. తాండూరులో తిరగకుండా ఇంట్లోనే కూర్చోవాలని హెచ్చరించారు. ఇప్పటికైనా తాండూరు ప్రజలు నియోజకవర్గంలో జరుగుతున్న విషయాలను గమనించి కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పాలని కోరారు. తాండూరు అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన పనులను, తెచ్చిన నిధులను గుర్తు చేశారు. ప్రాణం ఉన్నంత వరకు తాండూరు ప్రజల కోసం సేవకుడిగా పని చేస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలను మనోహర్‌రెడ్డి కించపరిచేలా ప్రవర్తిస్తున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్ బ్రదర్స్‌లా.. తాండూరులో మనోహర్‌రెడ్డి కుటుంబ పాలన జరుగుతుందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు పొందిన పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించడంతో పాటు ఉన్న వాటిని సరిగా అమలు చేయకపోవడంతో పేదలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు నయీం, నర్సిరెడ్డి, రవిందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సలీం, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జయజయహే.. మహిషాసురమర్దిని..

ఉమ్మడి జిల్లాలో దేవీశరన్నవరాత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. తొమ్మిది రోజు శుక్రవారం అమ్మవారు పలు అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాలు, మండపాల వద్ద అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు హోమాలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన, కలశపూజలు, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఆమనగల్లు వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చిన అమ్మవారు

హడావుడే తప్ప..
హామీల్లేవ..

షాద్‌నగర్ నియోజకవర్గంలో చప్పగా సాగిన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

- సీఎం ప్రసంగంలో సగం సమయం విమర్శలకే పరిమితం
- సంక్షేమ పథకాలు, నియోజకవర్గ ప్రగతిపై మాట్లాడని సీఎం
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇచ్చిన అభివృద్ధి పనుల చిట్టా ఇంటికెళ్లి చదువుతా అని చెప్పిన సీఎం
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగంపై పెదవి విరిచిన నియోజకవర్గ ప్రజలు
- కొందుర్గు మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనానికి శంకుస్థాపన చేసిన సీఎం
- సీఎం పర్యటన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు పలువురు రైతులను ముందస్తుగా అరెస్ట్ చేసిన పోలీసులు


సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సభలో పాల్గొన్న విద్యార్థినులు, జనం

షాద్‌నగర్, అక్టోబర్ 11 : షాద్‌నగర్ అంటే తనకు ప్రత్యేక అభిమానం అంటూ స్వయంగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం అభివృద్ధి పనులపై మాత్రం పెదవి విప్పలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటి సారిగా షాద్‌నగర్ నియోజకవర్గంలో అధికారికంగా సీఎం రేవంత్‌రెడ్డి పర్యటిస్తున్నారు. కచ్చితంగా నియోజకవర్గంపై హామీల వర్షం కురిపిస్తారు... అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని గంపెడు ఆశలు పెట్టుకున్న నియోజకవర్గ ప్రజలకు నిరాశే మిగిలింది. కానీ ఎప్పటి లాగే ప్రతిపక్ష పార్టీని టార్గెట్ చేస్తూ సీఎం ప్రసంగం విమర్శలు... తమ పార్టీకి సంబంధించిన గొప్పలతోనే సరిపోయింది. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి వరాలు ప్రకటిస్తారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తారని భావించిన సామాన్య ప్రజలు సీఎం ప్రసంగం విని పెదవి విరిచారు. శుక్రవారం షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించే ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఆవశ్యకత, విద్యార్థుల ప్రయోజనాలు, విద్యా ప్రమాణాల వంటి అంశాలపై మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యతను మాత్రం ప్రతిపక్ష పార్టీ నాయకులు, మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు, మరో నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లపై తీవ్ర విమర్శలు చేశారు. సీఎం ప్రసంగానికి మునుపు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి కావాల్సిన నిధులు, పనుల వివరాలను సీఎంకు సభా ముఖంగా వివరించారు. షాద్‌నగర్ ప్రాంతంలో మెడికల్ కళాశాల ఏర్పాటు, చౌదరిగూడ మండల కేంద్రంలో మండల పరిషత్ భవనం, పోలీస్ స్టేషన్ భవనం, ప్రభుత్వ దవాఖాన ఏర్పాటు, లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం వంటి అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సాహంతోనే రాజకీయాల్లో రాణిస్తున్నానని ఎమ్మెల్యే ప్రస్తావించారు. అయినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే సూచించిన అభివృద్ధి పనులపై స్పష్టత ఇవ్వలేదు. షాద్‌నగర్ అభివృద్ధికి సభా ముఖంగా ఎలాంటి వరాలు, హామీలు ఇవ్వలేదు. ఎమ్మెల్యే ప్రస్తావించిన అభివృద్ధి పనుల చిట్టా చాలా పెద్దగా ఉన్నదని, ఇంటికి వెళ్లి చదువుతానని చెప్పారే తప్ప హామీలపై ఎలాంటి స్పష్టత లేకపోవడంపై పలు విధాలుగా ప్రజలు చర్చించుకున్నారు. ఇలా సీఎం పర్యటనపై స్థానికుల ఆశలు అడియాశలు అయ్యాయని పలువురు వాపోయారు. ఇదిలా ఉంటే సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచే ఎమ్మార్పీఎస్ నాయకులు, పలువురు రైతులను ముందస్తుగా అరెస్ట్ చేసి చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముందస్తు అరెస్టులపై ఎమ్మార్పీఎస్ నాయకులు మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అక్రమ అరెస్టులు సరికాదని, మాదిగల ఏబీసీడీ రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తే అరెస్ట్‌లకు పాల్పడడం దేనికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బతుకమ్మకు నీటి కష్టాలు
బతుకమ్మల నిమజ్జనానికి చెరువులు, కుంటల్లో నీరులేక వట్టిపోయాయి. మండలంలోని జాపాలలో డ్రమ్ములో నీటిని పోయించి నిమజ్జనం చేసి మహిళలు బాధగా వెనుతిరిగారు. చెరువుల వద్ద వీధిదీపాలు లేక ఇబ్బందులు పడ్డారు. - మంచాల

తాండూరులో బస్సులు లేక ఆటోలో గ్రామాలకు వెళ్తున్న ప్రయాణికులు

పండుగ పూట
ప్రైవేటు వాహనాలే దిక్కు

వికారాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ) : పండుగ పూట ప్రయాణికులకు ప్రైవేట్ వాహనాలే దిక్కయ్యాయి. ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నా.. వాస్తవానికి మాత్రం పరిస్థితి భిన్నంగా ఉన్నది. ఆర్టీసీ బస్సులు సరిపోను లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. జిల్లా నుంచి హైదరాబాద్‌తోపాటు తాండూరు, సదాశివపేట, శంకర్‌పల్లి తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల కోసం ఎదురుచూసి బస్సులు రాకపోవడం, వచ్చిన ఒక్క బస్సు ప్రయాణికులతో కిక్కిరిసి పోవడంతో ప్రైవేట్ వాహనాలను ఎంచుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి జిల్లాలోని వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల్లోని సొంతూళ్లకు వచ్చేవారు ప్రైవేట్ వాహనాల్లోనే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కు బిక్కుమంటూ ప్రయాణం చేస్తుండడం గమనార్హం. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమని తెలిసినప్పటికీ తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాల్లో సొంతూళ్లకు చేరుకుంటున్నారు. తాండూరు నుంచి బషీరాబాద్ తదితర గ్రామాలకు వెళ్లేందుకూ సరిపడా ఆర్టీసీ బస్సులు లేక ఆటోలు, తుఫాన్ వాహనాల్లోనే వెళ్తున్నారు. హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్‌కు వస్తున్న ప్రయాణికులు సొంతూళ్లకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొడంగల్ నుంచి తుపాన్ వాహనాలు ఉండగా, మిగతా ప్రాంతాల నుంచి ఆటోల్లో ప్రయాణికులు గమ్యస్థానానికి చేరుకుంటున్నారు. గ్రామాలకు వెళ్లేందుకు ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఐదారుగురు వెళ్లాల్సిన ఆటోల్లో పది మందికిపైగా తీసుకెళ్తున్నారు. సొంతూళ్లకు వెళ్తున్న ఇంటిల్లిపాది రోడ్లపైనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొన్నది. మరోవైపు ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన ప్రభుత్వం బస్సులు సరిపోను సమకూర్చకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు కిక్కిరిసిన జనాలను చూసి భయంతో అధిక డబ్బులు పెట్టుకొని ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం కల్పించి, పండుగ పూట సరిపోను బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రభుత్వ తీరుపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే అవకాశంగా తీసుకుంటున్న ప్రైవేట్ వాహనాల వారు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. మొన్నటి వరకు తీసుకున్న చార్జీలకు రెట్టింపు డబ్బులను ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాలకు బస్సులు వేయాలి..
ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కేవలం మెయిన్ రోడ్డుపైన కూడా చాలీచాలని విధంగా బస్సులను నడిపిస్తున్నారు. పల్లెలకు వెళ్లాలంటే మాత్రం ఆటోనో, లేదంటే ఏదైనా ప్రైవేటు వాహనాన్నో మాట్లాడుకుని వెళ్లాల్సి వస్తున్నది.
– రవి, గోగ్యనాయక్‌తండా, కులకచర్ల

- ఆర్టీసీ బస్సులు సరిపోను లేక ప్రయాణికుల ఇక్కట్లు
- ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని చెబుతున్నా..
- గంటల తరబడి ఎదురుచూపులు
- సొంతూళ్లకు అధిక డబ్బు లిచ్చి ప్రైవేట్ వాహనాల్లోనే వెళ్తున్న జనం

పండుగ పూట అవస్థలు..
పట్టణాల నుంచి సొంత ఊరికి వెళ్లాలంటే బస్సులు లేక గంటల తరబడి వేచి చూడాల్సి వస్తున్నది. చిన్నపిల్లలను వేసుకుని నిలబడలేక ఆటోలను ఆశ్రయించాల్సిన వస్తున్నది. అందులో చాలా మందిని కూర్చోబెట్టడం వల్ల అవస్థలు పడుతున్నాం. కాంగ్రెస్ సర్కార్ సరిపడా బస్సులు వేయిస్తే బాగుండేది.
– వెంకటయ్య, ఘనాపూర్, కులకచర్ల మండలం

తాండూరు బస్టాండులో కిటకిటలాడుతున్న జనం

పండుగకు ప్రత్యేక బస్సులు ఏవీ..
పండుగకు ప్రత్యేక బస్సులు వేయిస్తామని ఆర్టీసీ అధికారులు చెప్పినా.. అవి సరిపోకపోగా సరైన సమయానికి రాక ప్రయాణికులు గోస పడుతున్నరు. ఆటోలో వెళ్దామంటే చాలా మందిని కుక్కికుక్కి నింపుతున్నడు. కాంగ్రెస్ ప్రభుత్వం పండుగకు ఎక్కువ బస్సులను వేస్తే బాగుండేది. ఊరికెళ్లాలంటే రోజు మొత్తం సమయం పడుతుంటే.. మేము సంతోషంగా ఉండేదెప్పుడు. ఆర్టీసీ అధికారులు ఆలోచించాలి.
– అశోక్, చౌడాపూర్

పైసలిస్తేనే.. వార్డుల్లోకి..

ప్రభుత్వ దవాఖానల్లో కిందిస్థాయి సిబ్బంది చేతివాటం

సిటీబ్యూరో, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానలను ఆశ్రయించే నిరుపేద రోగులకు కిందిస్థాయి సిబ్బంది తీరు శాపంగా మారుతున్నది. అయినవారు అనారోగ్యానికి గురై దవాఖానలో చేరితే వారిని చూసేందుకు వచ్చిన వారి నుంచి నగరంలోని పలు ప్రభుత్వ దవాఖానల్లో ప్రవేశ ద్వారాల వద్ద ఉండే సెక్యూరిటీ గార్డులు ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, పేట్లబుర్జు, సుల్తాన్‌బజార్ దవాఖానల్లో వార్డుల వద్ద ప్రవేశ ద్వారాల్లో ఉండే సెక్యూరిటీ సిబ్బంది డబ్బులు ఇస్తేనే లోనికి అనుమతిస్తున్నట్లు రోగి సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగుల వద్దకు వెళ్లేందుకు పాస్‌లు ఉన్నా.. డబ్బులు ఇవ్వనిదే అనుమతించడం లేదని వాపోతున్నారు. ఒకవేళ గట్టిగా నిలదీస్తే నిర్ణీత సమయంలోనే రావాలని చెబుతున్నారని, డబ్బులు ఇస్తే మాత్రం సమయం, సందర్భాలేవి లేకుండా అనుమతిస్తున్నట్లు రోగుల సహాయకులు ఆరోపిస్తున్నారు.

కనికరం చూపడం లేదు

రోగికి అత్యవసరమని చెప్పినా.. ప్రవేశ ద్వారా వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డులు కనికరించడం లేదని రోగి సహాయకులు వాపోతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల పేట్లబుర్జు ప్రసూతి దవాఖానలో చికిత్స పొందుతున్న రోగికి అత్యవసరమని చెప్పినా అక్కడి సెక్యూరిటీ సిబ్బంది అనుమతించకపోవడంతో సకాలంలో వైద్యం అందక సదరు రోగి మృత్యువాత పడ్డాడు. దీనిపై బాధితులు దవాఖాన అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పెద్దగా స్పందించలేదు. కాగా, నగరంలోని ప్రభుత్వ దవాఖానల్లో రోగులు, రోగి సహాయకులకు అక్కడ ఉన్న కొందరు కిందిస్థాయి సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గతంలో కూడా సెక్యూరిటీ సిబ్బంది, ఆయాల అవినీతిపై అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి అనేకసార్లు బహిరంగంగానే హెచ్చరించి, పలువురిపై చర్యలు తీసుకున్నా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు.

ఆర్ఎంవోల అండదండలు

కొందరు ఆర్ఎంవోల అండదండలతోనే కిందిస్థాయి సిబ్బంది రోగులపై తమ ప్రతాపం చూపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సెక్యూరిటీ, శానిటేషన్‌కు సంబంధించిన సూపర్‌వైజర్లతో దవాఖానల్లోని కొందరు ఆర్ఎంవోలు కుమ్మకై వచ్చిన దాంట్లో పంపకాలు చేసుకుంటారని, దీంతో ఎక్కువగా కలెక్షన్లు చేసే వారిని ప్రవేశ ద్వారాల వద్ద నియమించి డబ్బులు వసూళ్లు చేయడంలో వారు పరోక్ష పాత్ర పోషిస్తున్నట్లు దవాఖాన వర్గాలే ఆరోపిస్తున్నాయి. కొందరు ఆర్ఎంవోల అండదండలతో సెక్యూరిటీ, శానిటేషన్ సూపర్‌వైజర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు కలెక్షన్లు అధికంగా వచ్చే వార్డులు, గేట్ల వద్ద తమకు అనుకూలమైన వ్యక్తులకు డ్యూటీలు వేసి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎక్కువగా ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, పేట్లబుర్జు, సుల్తాన్‌బజార్ ప్రసూతి దవాఖానల్లో నడుస్తున్నట్లు తెలుస్తున్నది. కొందరు పై స్థాయి అధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు పాల్పడుతున్న అక్రమ వసూళ్లతో నిరుపేద రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు.